సాక్షి
నంద్యాల
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



శిఖరంపై కలశ ప్రతిష్టాపన చేస్తున్న పండితులు, చిత్రంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి తదితరులు



వేడుకగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

న్యూస్‌రీల్

శ్రీగిరిలో భక్తుల రద్దీ



మల్లన్న దర్శనానికి వెళ్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం పరమేశ్వరుడికి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి బారులు తీరారు. భక్తుల రద్దీతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు నిండిపోయాయి. ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన పలువురు భక్తులు మల్లికార్జున స్వామిని స్పర్శదర్శనం చేసుకున్నారు.కాగా భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

పీఎంశ్రీ పాఠశాలల్లో వసతులు కల్పించండి

కర్నూలు సిటీ: కర్నూలు, నంద్యాల జిల్లాలో ఎంపికై న పీఎంశ్రీ పాఠశాలల్లో వసతులు కల్పన వేగవంతం చేయాలని స్టేట్ సిమాట్ డైరెక్టర్ వి.మస్తానయ్య అన్నారు. పీఎంశ్రీ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై సోమవారం ఆయన సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని 52 పాఠశాలలు, నంద్యాల జిల్లాలోని 40 పాఠశాలల్లో పీఎంశ్రీ పాఠశాలల ఫేజ్ వన్, ఫేజ్ టుకు విడుదలైన కెమిస్ట్రీ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, ఆట స్థలాలు, కాంపొజిట్ గ్రాంట్ మొదలగు వాటికి విడుదలైన నిధులను సక్రమంగా సద్వినియోగం చేయాలన్నారు. సమగ్ర శిక్ష నుంచి విడుదలైన నిధులు పూర్తిగా సక్రమంగా వినియోగిస్తే తదుపరి నిధులు విడుదల చేస్తామన్నారు. ఈ సమీక్షలో ఉమ్మడి జిల్లాల సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు వి.శ్రీనివాసులు, హేమంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.శ్రీనివాసులు, పర్యవేక్షణ అధికారులు, పీఎంశ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మాకొడితే కఠిన చర్యలు

నందికొట్కూరు: ఎలాంటి అనుమతి లేకుండా విధులకు డుమ్మా కొడితే చట్ట పరమైన చర్యలు తప్పవని నంద్యాల జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.హేమంతకుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని భవిత సెంటర్, జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, ఉర్దూ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అలాగే కోనేటమ్మపల్లె మండల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. భవిత సెంటర్‌లో విధులకు గైర్హాజరు అయ్యారని కాంట్రాక్ట్ టీచర్ విజయకుమారిని, సరైన సమాధానం చెప్పలేదని మరో టీచర్ రవి బాబును షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సిబ్బంది ఇష్టానుసారంగా విధులకు హాజరైతే సహించే ప్రసక్తే లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న తరగతి గదుల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ సుభాన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అకడమిక్ మానిటర్ ఆఫీసర్లు లలితకుమారి, యూనస్‌బాషా పాల్గొన్నారు.

పాఠశాలల మరమ్మతులకు నిధుల మంజూరు

జూపాడుబంగ్లా: జిల్లాలో మూడు గురుకుల పాఠశాలల మరమ్మతులకు రూ.26.50 లక్షల నిధులు మంజూరైనట్లు ఏపీఈడబ్ల్యూఐడీసీ ఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఆయన జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఆళ్లగడ్డ గురుకుల పాఠశాలకు రూ.15 లక్షలు, డోన్ పాఠశాలకు రూ.5 లక్షలు, జూపాడుబంగ్లా పాఠశాలకు రూ.6.5 లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. జూపాడు బంగ్లా గురుకులలో కూలిన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ. 20 లక్షలు అవసరమని పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈఈ వెంట ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి ఉన్నారు.

డీసీసీబీలో నాబార్డు తనిఖీలు

కర్నూలు (అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నా బార్డు వార్షిక తనిఖీలకు సోమవారం శ్రీకారం చుట్టింది. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ స్థాయి అధికారి నేతృత్వంలో నాబార్డు బృందం 2023-24 సంవత్సరానికి సంబంధించి వార్షిక తనిఖీ చేపట్టింది. గత ఆర్థిక సంవత్సరంలో డీసీసీబీ ద్వారా జరిగిన లావాదేవీలను అధికారుల బృందం పరిశీలిస్తోంది. దాదాపు 20 రోజుల పాటు జరిగే తనిఖీల్లో బ్యాంకు ప్రగతిపై స్పష్టత వస్తుంది. అప్పటికప్పుడు బ్రాంచీలను ఎంపిక చేసుకుని అక్కడికి వెళ్లి తనిఖీలు చేయనున్నారు. నాబార్డు బృందానికి అడిగిన సమాచారం ఇవ్వడానికి డీసీసీబీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

చూసిన కనులదే మహా భాగ్యం



వేడుకను తిలకిస్తున్న భక్తజన సందోహం

- వైభవంగా ఉరుకుంద ఈరన్న స్వామి మహాకుంభాభిషేకం
- శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపనలు
- నేత్రానంద పర్వంలా హెలికాప్టర్ నుంచి పుష్ప వృష్టి
- తరలివచ్చిన భక్త జనం

మంత్రాలయం/కౌతాళం: శిఖరాగ్రాన స్వర్ణ కలశాల ప్రతిష్ట శుభవేళ వేద ఘోష నింగిని తాకింది. భక్త నీరాజనం నేలన మురిసింది. ఆకాశం నుంచి విరుల వృష్టి కురుస్తుండగా ఈరన్న మహా కుంభాభిషేక మహోత్సవం సంబరంగా సాగింది. ఉరుకుంద ఈరన్న క్షేత్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో ఈ ఘట్టం లిఖిత పూర్వకమై నిలిచింది. మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా మూడవరోజు సోమవారం ఉత్సవాలు అంగరంగా వైభవంగా సాగాయి. ఈరన్న క్షేత్రంలో నూతనంగా నిర్మించిన నాలుగు రాజగోపురాలు, విమాన గోపురంపై స్వర్ణ కలశాల ప్రతిష్టాన, సప్త నదీ జలాల అభిషేకం గావించారు. ముందుగా యాగశాలలో శైవాగమ శాస్త్ర ప్రవీణ సుబ్రహ్మణ్య శాస్త్రి నేతృతంలో యాగశాలలో గోపుర కలశాలు, దేవతామూర్తుల విగ్రహాలకు వేద పఠనంతో ప్రత్యేక పూజలు గావించారు. పూజలు ముగియగానే దాతలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కలశాలతో ఆలయ ప్రధాన తూర్పు రాజగోపురానికి మంగళవాయిద్యాలతో చేరుకున్నారు. తక్కిన నాలుగు రాజగోపురాలకూ దాతలు, పండితులు మేళతాళాలతో గోపురాల పైభాగానికి చేరారు. మరికొందరు దాతలు నూతనంగా నిర్మించిన గణనాథుడు, లక్ష్మీదేవి మంటపాలకు వచ్చారు. అక్కడ వేద పఠనంతో పుష్పగిరి శంకరాచార్య మఠాధిపతులు విద్యానృసింహ స్వామి చేతుల మీదుగా యంత్రస్థాపనతో వినాయకుడు, లక్ష్మీదేవి విగ్రహాల ప్రతిష్ట పూర్తి చేశారు. అనంతరం ఆయా రాజగోపురాలపై కలశాల ప్రతిష్టకు అంకురార్పణ పలికారు. వేద శిఖరాగ్రాన పండితులు ఎంతో పవిత్రంగా శాస్త్రోక్తంగా శక్తులను ఆవాహం చేస్తూ కలశాల ప్రతిష్ట చేపట్టారు. నిర్ణీత ముహూర్తం ఉదయం 11.59 గంటలకు ప్రతిష్ట, అభిషేక మహోత్సవం ముగించారు. కలశాల ప్రతిష్ట ముగియగానే 45 అడుగుల టేకు ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకగా సాగింది. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, ఈవో మేడేపల్లి విజయరాజు ఆధ్వర్యంలో మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది.



ప్రవచిస్తున్న పీఠాధిపతి విద్యానృసింహ భారతి స్వామి, చిత్రంలో సుబుదేంద్ర తీర్థులు

పీఠాధిపతుల చేతుల మీదుగా క్రతువులు..

ఈరన్న స్వామి కుంభాభిషేకానికి పుష్పగిరి శంకరాచార్య మూల సంస్థానం పీఠాధిపతి విద్యానృసింహ భారతీస్వామి, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, హాల్వి సిద్ధేశ్వరస్వామి మఠం పీఠాధిపతి మహంతేశ స్వామి చేతుల మీదుగా క్రతువులు గావించారు. పీఠాధిపతుల చేతుల మీదుగా కలశ, దేవతామూర్తుల ప్రతిష్టలు చేపట్టారు. అనంతరం యాగశాలలో పీఠాధిపతులు ఆశీర్వచన ప్రవచనాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



రాజ గోపురంపై హెలికాప్టర్‌తో పూల వాన కురిపిస్తున్న దృశ్యం

హెలికాప్టర్‌తో పుష్పాభిషేకం..

మహా కుంభాభిషేక ఘట్టంలో హెలికాప్టర్‌తో పుష్పాభిషేకం గావించడం ప్రత్యేకం. ఉభయ తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా కుంభాభిషేక మహోత్సవంలో హెలికాప్టర్‌తో పుష్పాభిషేకం చేయడం విశేషం. బెంగళూరుకు చెందిన మంజునాథ్ అనే భక్తుడు రూ.22 లక్షల సహకారంతో హెలికాప్టర్‌తో 5 క్వింటాళ్ల విరులతో పుష్పవృష్టి చేపట్టారు. భక్తుల కోలాహలం మధ్య, వేద మంత్రోచ్ఛారణతో 5 రాజగోపురాలపై పూల వాన కురిపించారు. ఈ వేడుక భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

కేజీ బంగారు నాగాభరణ నృసింహస్వామి విరాళం



ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్‌రెడ్డి తల్లి కీ.శే.లలితమ్మ పేరిట కేజీ బంగారు నాగాభరణ నృసింహస్వామి విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.22 లక్షలతో ఆలయ ప్రధాన రాజగోపుర కలశాలు విరాళంగా ఇచ్చారు. అంతేగాక రెండు పంచలోహ లక్ష్మీదేవి కిరీటాలు, రెండు ధ్వజ తోరణాలు, ప్రవలికలు అందజేశారు.

ప్రజా వినతులు నాణ్యతతో పరిష్కరించండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం

నంద్యాల: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో 17 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఆస్తులను జియో ట్యాగింగ్ చేసి ఫొటో అప్‌లోడ్ చేయడంతో పాటు సంబంధిత వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే హౌస్ హోల్డ్ డేటా కూడా పక్కాగా జియో కోఆర్డినేట్ చేయాలన్నారు. మనమిత్ర వాట్సాప్ గ్రూపు ద్వారా 161 పౌర సేవలు అందించేందుకు సచివాలయ సిబ్బంది సమాయత్తం కావాలన్నారు. ఈ - శ్రామ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల మంజూరుకు ఈ ఆర్థిక సంవత్సరం 2,156 యూనిట్లు కేటాయించారన్నారు. జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో రెవెన్యూ, రీసర్వేకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వస్తున్న నేపథ్యంలో నిర్ణీత కాల పరిమితిలోగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీలు

ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. 66 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు డిప్యూటీ తహసీల్దార్లను కేటాయించాలన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు 15,692 మంది, రెండో సంవత్సరం పరీక్షలు 13,400 మంది రాయనున్నట్లు తెలిపారు. ఈనెల 5 నుంచి జరిగే ప్రాక్టికల్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్ష కేంద్రాలకు వచ్చేందుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేసీ విష్ణు చరణ్, డీఐఈఓ సునీత, ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ స్పెషల్ ఆఫీసర్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

ఫిర్యాదులు పునరావృతం కానివ్వొద్దు

బొమ్మలసత్రం: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ తన కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 95 మంది అర్జీలు ఇచ్చారు. వాటిని పరిశీలించిన ఎస్పీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఫిర్యాదుల్లో కొన్ని

- నంద్యాల శివారులోని నందమూరినగర్ వీధికి చెందిన నాగమణి తన తండ్రి ప్రభాకర్‌పై ఫిర్యాదు చేశారు. ఊహ తెలిసినప్పటి నుంచి తన తల్లి ఎవరు ..ఎక్కడుందని అడిగితే తండ్రి సరైన సమాధానం చెప్పడం లేదని వాపోయారు. విచారించి ఆచూకీ కనిపెట్టాలని పోలీసు అధికారులను కోరారు.
- ఫరూక్ అనే వ్యక్తికి ఇల్లు అద్దెకు ఇస్తే ఖాళీ చేయకుండా తిరిగి తననే బెదిరిస్తున్నాడని పట్టణానికి చెందిన షఫీ ఉన్నిసా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- ఆళ్లగడ్డకు చెందిన మిఖాయిల్ అనే యువకుడు తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి నగదు, బంగారు ఆభరణాలు కాజేశాడని ఓ యువతి ఎస్పీ ఎదుట వాపోయారు. మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తనను న్యాయం చేయాలని కోరారు.



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కాలిబాటమార్గంలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- ఉత్సవాల ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ జాయింట్ కమిషనర్, ఉత్సవాల ప్రత్యేక అధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఆయన కై లాసద్వారం, హటకేశ్వరం, లడ్డుప్రసాదాల విక్రయకేంద్రాలు, దర్శనం క్యూలు, క్యూకాంప్లెక్స్ మొదలైన వాటిని పరిశీలించారు. అనంతరం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు దర్శనం, మంచినీటి సరఫరా, పాతాళగంగలో పుణ్యస్నానాలు, తలనీలాలు సమర్పణ తదితర వాటితో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వైద్యారోగ్యసేవలు, వాహనాల పార్కింగ్, పారిశుద్ధ్యంపై చర్చించారు. ముందుగా ఈఓ ఎం.శ్రీనివాసరావు బ్రహ్మోత్సవాలకు సంబంధించి దేవస్థానం చేపట్టిన ఏర్పాట్లను వివరించారు. అనంతరం ఉత్సవాల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ కైంకర్యాల నిర్వహణలో సమయ పాలన పాటించాలన్నారు. కొరత లేకుండా మంచినీటి సరఫరా చేపట్టాలన్నారు. హటకేశ్వరం వద్ద భక్తులు స్నానాలాచరించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవాల ముందు రోజు నుంచే కైలాసద్వారం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. భక్తులు క్యూలలో అధిక సమయం వేచి ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు సమావేశంలో ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, సీనియర్ వేదపండితులు, స్థానాచార్యులు, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి చంద్రశేఖర ఆజాద్

కొలనుభారతిలో కొనసాగిన అక్షరాభ్యాసం

కొత్తపల్లి: వసంత పంచమిని పురస్కరించుకుని రెండోరోజు సోమవారం మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు కొనసాగాయి. దాదాపు 300 మంది చిన్నారులతో జరిగిన ఈ కార్యక్రమం పండుగలా సాగింది. ముందుగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు సరస్వతీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ప్రాంగణంలో సామూహిక అక్షరాభ్యాసం

నీలకంఠేశ్వరా.. నీళ్లు తాగేదెట్టా..

- పర్యావరణ పరిరక్షణ పేరుతో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధించిన అటవీశాఖ
- శ్రీశైలం, సున్నిపెంటతో పాటు పెచ్చెర్వులోనూ విక్రయించరాదు
- ఇప్పటికే వ్యాపారులు, దుకాణదారులకు నోటీసుల జారీ
- నిషేధంతో పాదయాత్ర భక్తుల తాగునీటికి ఇబ్బందులు
- శ్రీశైలంలో గాజు సీసాతో లీటర్ నీళ్లు రూ.60
- భారమవుతుందంటున్న సామాన్య భక్తులు

శ్రీశైలంటెంపుల్: పర్యావరణ పరిరక్షణ పేరుతో అటవీశాఖ శ్రీశైలంలో ప్లాస్టిక్ బాటిళ్లను నిషేధించింది. అటవీ పరిధిలోని పెచ్చెర్వు ప్రాంతంలోనూ వాటిని విక్రయించకూడదని నోటీసులు జారీ చేసింది. దీంతో శ్రీగిరిలో లీటర్, రెండు లీటర్ల ప్లాస్టిక్ వాటర్ బాటిల్ దొరకక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.రెండువారాల్లో శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. చాలా మంది నల్లమల అటవీప్రాంతంలో పాదయాత్రగా వస్తుంటారు. మధ్యమధ్యలో దాహం వేస్తే తీర్చుకునేందుకు వెంట లీటర్, రెండు లీటర్ల ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటారు. అటవీశాఖ వాటిని నిషేధించడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.



శ్రీశైల ఆలయం

వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయని నిషేధం

నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ముఖ్యమైన ప్రదేశం శ్రీశైలం. ఈ ప్రాంతంలో పెద్దపులి, చిరుతపులులు, అనేక వన్యప్రాణులు, అటవీజంతువులు సంచరిస్తుంటాయి. పాదయాత్రగా వచ్చే భక్తులు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వాడి పారవేస్తారు. వాటిని వన్యప్రాణులు తిని మృత్యువాత పడుతున్నాయని అటవీశాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే వారు కొద్ది నెలలుగా శ్రీశైలం, సున్నిపెంటతో పాటు పెచ్చెర్వు ప్రాంతంలో ఎవరైనా ప్లాస్టిక్ బాటిళ్లు అమ్మితే దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. రానున్న మహాశివరాత్రి, ఉగాది ఉత్సవాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారు వాటర్‌బాటిళ్లతో పాటు కూల్ డ్రింక్, వాటర్ ప్యాకెట్లు, బ్యాగులు, కవర్లు, గ్లాసులు, ప్లేట్స్, ప్లాస్టిక్ కవర్‌తో కూడిన ఏ వస్తువులను విక్రయించరాదని శ్రీశైలం రేంజ్ అటవీశాఖ అధికారి నోటీసులు సైతం జారీ చేశారు. ఈ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొనడంతో వ్యాపారులతో పాటు సామాన్య భక్తులు ఆందోళన చెందుతున్నారు.

లీటర్ నీళ్లు కొనాలంటే రూ.60 వెచ్చించాల్సిందే

శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి అనునిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. శ్రీశైలం, సున్నిపెంట గ్రామంలో భక్తులు, యాత్రికులు, స్థానికులు నీళ్ల బాటిల్ కొనాలంటే గాజు సీసానే తీసుకోవాలి. ఇందులో లీటర్ నీళ్లు తాగి ఆ సీసను దుకాణదారుడికి ఇస్తే రూ.30, వెంట తీసుకెళ్తే రూ.60 చెల్లించాలి. శ్రీశైలానికి ఎక్కువగా సామాన్య భక్తులు వస్తారు. ప్రతి ఒక్కరూ లీటర్ తాగునీటికి రూ.60 వెచ్చించి బాటిల్ కొనుగోలు చేయాలంటే భారమవుతుంది.



ఈసారి పాదయాత్రికులకు ఇబ్బందే

మునుపెన్నడూ లేనివిధంగా మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాలకు ప్లాస్టిక్ లీటర్, రెండు లీటర్ల బాటిళ్లపై నిషేధం విధించడంతో పాదయాత్రగా వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నల్లమల అటవీప్రాంతంలో సుమారు 46 కిలోమీటర్ల నడిచి శ్రీశైలానికి చేరుకోవాల్సి ఉంటుంది. భైర్లూటీ. పెచ్చెర్వు ప్రాంతంలో మాత్రమే తాగునీటి సౌకర్యం ఉంటుంది. పెచ్చెర్వు నుంచి భీమునికొలను వరకు ఎటువంటి తాగునీటి వసతి ఉండదు. నల్లమల అడవిలో భక్తులు నడవడమే కష్టం. లీటర్, రెండు లీటర్ల వాటర్ బాటిళ్ల నిషేధంతో వెంట ఐదు లీటర్ల వాటర్ క్యాన్ తీసుకెళ్లాలంటే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో అటవీ అధికారులు ఉత్సవాల సమయంలో మినహాయింపు ఇవ్వాలని, లేకపోతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయంగా ఇలా చేస్తే మేలు..

- ప్లాస్టిక్ బాటిళ్లకు ప్రత్యామ్నాయంగా బయోడిస్పోజబుల్ బాటిళ్లను అనుమతించాలి.
- ఈ బాటిళ్లు అన్ని దుకాణాల్లో లభ్యమయ్యేలా, సామాన్యులకు సైతం అందుబాటులో ధర ఉండేలా అధికారులు చూడాలి
- ప్లాస్టిక్ బాటిళ్లను వన్యప్రాణులు, జంతువులు తినకుండా అటవీమార్గంలో ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణకు గతం కంటే ఎక్కువ సంఖ్యలో సిబ్బందిని నియమించాలి.
- సేకరించిన వాటిని ఎప్పటికప్పుడు సున్నిపెంటలోని ప్రాసెసింగ్ మిషన్ ద్వారా క్రష్ చేయాలి.

క్లుప్తంగా

బ్రిడ్జి పైనుంచి కింద పడి వ్యక్తి మృతి


సయ్యద్ నూర్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని మాసా మసీద్ కాలనీకి చెందిన సయ్యద్ నూర్ (60) సోమవారం ప్రమాదవశాత్తు కొత్త బ్రిడ్జి పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఘటనపై స్థానికులు వన్ టౌన్ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సయ్యద్ నూర్ సోమవారం కొత్త ఓవర్ బ్రిడ్జి సైడ్ వాల్‌పై కూర్చొని ఉన్నాడు. ప్రమాదవశాత్తు కిందకు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సయ్యద్‌గాసియా, ఐదుగురు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరి దుర్మరణం

ఆదోని రూరల్: 104బసాపురం వద్ద ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో మాల వీరేష్ (32) అనే వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. మాల వీరేష్ మద్యం సేవించి బైకు నడపుతూ ఎదురుగా వస్తున్న మరో బైకును ఢీకొట్టాడని, ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లాడన్నారు. అతన్ని బంధువులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక సోమవారం మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో పురుగు మందు తాగి..


సిద్ధప్ప (ఫైల్)

ఆదోని అర్బన్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన సిద్ధప్ప (40) మద్యం మత్తులో పురుగు మందు సేవించి సోమవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగనాథనహళ్లికి చెందిన మూకన్న కుమారుడు సిద్ధప్ప ఇంట్లో ఎవరూ లేని సమయంలో మద్యం మత్తులో తెలియక పురుగు మందు తాగాడు. కాసేపటికి ఎద్దులకు నీరు తాపేందుకు అన్న కుమారుడు ఇంటికి వచ్చి చూడగా సిద్ధప్ప అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే బంధువులకు సమాచారం అందించి, హుటాహుటిన ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో కోలుకోలేక సిద్ధప్ప మృతిచెందాడు. మృతుడికి భార్య ఈరమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో డ్రాయింగ్ మాస్టర్ మృతి



భీమరాజు (ఫైల్)

ప్యాపిలి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్న ధూపం భీమరాజు (47) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం గుండెపోటుకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ స్థితిలో కోలుకోలేక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న భీమరాజు మృతి పట్ల ఎంఈఓ వెంకటేష్ నాయక్ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

క్యాన్సర్ కలకలం!

- ఉమ్మడి జిల్లాలో ఏటా 30 వేల మందికి చికిత్స
- జీవనశైలిలో మార్పులే కారణం
- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించి ఏడాదవుతున్నా మొదలుకాని పూర్తి స్థాయి వైద్యసేవలు
- నేడు ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం

ఒకప్పుడు క్యాన్సర్ వ్యాధి గురించి సినిమాల్లో మాత్రమే చూపించేవారు. ఇప్పుడు ఈ వ్యాధి చుట్టుపక్కల వారిలో కూడా కనిపిస్తోంది. ఈ వ్యాధికి సంబంధించి వైద్య పరీక్షలు, మందులు, చికిత్సలు అందుబాటులోకి రావడంతో కోలుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నెల 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.


క్యాన్సర్ కణాలు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆధునిక వైద్య సౌకర్యాలు, ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించే అవకాశాలు రావడంతో చాలా మంది చికిత్స కోసం ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆరు శాతం మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాన్సర్ విభాగం 40 ఏళ్లకు పైగా రోగులకు వైద్యసేవలు అందిస్తూ వస్తోంది. ప్రస్తుతం ఇక్కడ రోజూ 10 మంది కొత్తవారు, 15 మంది పాత రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు నగరంలోని ఒమెగా, అమీలియో, పెంచికలపాడు గ్రామంలోని విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లోనూ క్యాన్సర్‌కు చికిత్స అందిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో రోజూ 250 నుంచి 300 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. అధికంగా నోటి క్యాన్సర్, రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, జీర్ణకోశ, పేగు క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మొదలుకాని వైద్య సేవలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను గతేడాది మార్చిలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఇక్కడ ప్రతి మంగళ, గురువారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే మెడికల్ ఆంకాలజీలో కీమోథెరపీ, సర్జికల్ ఆంకాలజీలో క్యాన్సర్ సర్జరీలు నిర్వహిస్తున్నారు. త్వరలో రేడియేషన్ విభాగంలో లీనియర్ యాక్సలరేటర్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వైద్యులు చెబుతున్నారు. అయితే ఇంకా పూర్తిస్థాయిలో వైద్యసేవలు మొదలు కాలేదు. దీంతో వైద్యులు, చికిత్స పరికరాలు ఉన్నా నిరుపయోగంగా ఉంచాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీలో చికిత్స అందించే ఆసుపత్రుల్లో ఏటా 30 వేలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, పలురకాల ఇన్‌ఫెక్షన్లు, స్థూలకాయం, ధూమ, మద్యపానం వంటివి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన క్యాన్సర్ రోగుల సంఖ్య

సంవత్సరం	సర్జికల్ ఆంకాలజీ	మెడికల్ ఆంకాలజీ	రేడియేషన్ ఆంకాలజీ
2019-20	8,596	10,846	8,306
2020-21	9,564	12,325	9,325
2021-22	10,396	14,214	10,103
2022-23 (కర్నూలు జిల్లా మాత్రమే)	5,124	5,796	4,939
2023-24	5,775	6,164	5,594
2024-25 (జనవరి వరకు)	3,109	3,214	2,918

లక్షణాలు

ముక్కు, నోటి నుంచి రక్తస్రావం, గడ్డలు ఏర్పడటం, రొమ్ము వద్ద చనుమొనలో ద్రవం కారడం, చర్మంలో మార్పు, పేగుల్లో బల్లలు ఏర్పడటం, పురీషనాళంలో నొప్పి, నిరంతర దగ్గు, కఫంలో రక్తం పడటం, ఛాతినొప్పి, భరించలేని తలనొప్పి, వికారం, వాంతులు, అవయవాల్లో బలహీనత వంటివి క్యాన్సర్ లక్షణాలు. చిన్న పరిమాణపు క్యాన్సర్ లేదా ప్రాథమిక దశల్లో ఉన్న వాటికి చికిత్స చేయడం సులభం.

కారణాలు

క్యాన్సర్ వ్యాధి రావడానికి 4 శాతం జన్యుపరంగా, 6 శాతం తీసుకునే నీరు, ఆహారం, 15 **శాతం** స్థూలకాయం, 40 శాతం పొగాకు, 10 శాతం ఇన్‌ఫెక్షన్లు కారణమవుతాయి. మిగిలిన 25 శాతం క్యాన్సర్లకు సరైన కారణాలు లేవు.

క్యాన్సర్‌కు సంకేతాలు

- మలమూత్ర విసర్జనలో మార్పులు
- దీర్ఘకాలం మానని పుండ్లు, అసహజ రక్తస్రావం
- గొంతు బొంగురుపోవడం
- నొప్పి లేకుండా పెరుగుతున్న కణితులు
- తీవ్రమైన అలసట, బలహీనత
- పుట్టుమచ్చలలో సహజ మార్పులు

నేడు క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు



ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా 4వ తేదీన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నుంచి రాజవిహార్ వరకు ర్యాలీ కొనసాగుతుంది. వైద్యులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొంటారు. ప్రస్తుతం స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆంకాలజీ విభాగంలో కీమోథెరపీ, సర్జికల్ ఆంకాలజీలో క్యాన్సర్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. క్యాన్సర్ చివరి దశలో ఉన్న వారికి పాలియేటివ్ చికిత్సను అందిస్తున్నాం.

– డాక్టర్ శివప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ ఆంకాలజీ, కర్నూలు మెడికల్ కాలేజీ

నివారణపై ప్రత్యేక దృష్టి



క్యాన్సర్ నివారణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రతి జిల్లాలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీంతో పాటు 36 ప్రాణాధార క్యాన్సర్ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని మినహాయించింది. క్యాన్సర్ వైద్యంలో వాడే మందులపై జీఎస్టీ తగ్గించింది. ప్రజలు కూడా చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారం, తరచూ స్క్రీనింగ్ పరీక్షలు, వ్యాక్సిన్‌ల ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చు.

– డాక్టర్ సి.వాసురెడ్డి, సర్జికల్ ఆంకాలజిస్టు, కర్నూలు


కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న టౌన్ సీఐ శ్రీనివాసులు, (ఇన్‌సెట్) ఉపేంద్ర (ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని మేకల బజార్‌లో కుమ్మరి ఉపేంద్ర (20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు.. కాలనీకి చెందిన కుమ్మరి శ్రీనివాసులు, ఎల్లమ్మకు సాయిమురారి, ఉపేంద్ర, సాయి జయంతి సంతానం ఉన్నారు. పెద్దకుమారుడు జైపూర్‌లో అగ్రికల్చర్ బీఎస్సీ చదువుతున్నాడు. కుమార్తె సాయి జయంతికి వివాహం జరిగింది. చిన్న కుమారుడు ఉపేంద్ర స్థానిక నారాయణ కాలేజీలో ఇంటర్ బైపీసీ పూర్తి చేశాడు. బీ-ఫార్మసీకి క్వాలీఫై అయినా తండ్రి కాలేజీలో చేర్పించకపోవటంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. శ్రీనివాసులు భార్య ఎల్లమ్మ కొన్నేళ్ల కిందట చనిపోవటంతో తర్వాత లక్ష్మీదేవి అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరు కూరగాయల మార్కెట్‌లో మట్టి కుండలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి రెండవ అంతస్తులో నిద్రించే ఉపేంద్ర ఈ నెల 1న ఇంటికి ఆలస్యంగా వస్తానని తండ్రికి ఫోన్ చేసి చెప్పాడు. 2న ఆదివారం కావటంతో ఉదయమే కుండల వ్యాపారం చేసుకునేందుకు తల్లిదండ్రులు మార్కెట్‌కు వెళ్లి అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం మార్కెట్‌కు కుండలను తీసుకెళ్లేందుకు లక్ష్మీదేవి పైఅంతస్తుకు వెళ్లగా కుమారుడు ఉపేంద్ర రక్తపు మడుగులో బోర్లా పడి ఉండటం చూసి కేకలు వేసింది. పైకి వెళ్లిన శ్రీనివాసులు కుమారుడి మృతదేహాన్ని చూసి కుప్పకూలిపోయాడు. ఘటనపై పట్టణ పోలీసులకు సమాచారం అందించటంతో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ నాయక్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వెల్లడించారు.

పోక్సో కేసు నమోదు

నందికొట్కూరు: మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్‌ఐ తిరుపాల్ చెప్పారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. బ్రాహ్మణకొట్కూరుకు చెందిన కుమ్మరి నాగేంద్ర (21) డిగ్రీ పూర్తి చేసి జులాయిగా తిరుగుతున్నాడు. అదే కాలనీకి చెందిన మైనర్ బాలికను చాలా రోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనిపై బాలిక తండ్రి ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పొలం హద్దు విషయంలో ఎమ్మెల్యే వర్గానికి చెందిన జయరామిరెడ్డి, ఎంపీ వర్గానికి చెందిన పుల్లారెడ్డి ఘర్షణకు పాల్పడ్డారు. సదరు పొలం వద్ద రెవెన్యూ అధికారులు గతంలోనే హద్దులు ఏర్పాటు చేయగా పంట కోత కోసే విషయంలో మహిళల మధ్య మాటమాట పెరగడంతో ఘర్షణకు దారితీసింది. ఇరు వర్గాల వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సర్దుబాటు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఇదిలాఉండగా గత కొన్ని నెలల నుంచి రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. గ్రామంలోని పీహెచ్‌సీలో పనిచేసే వర్కర్ల విషయంలో ఆ వర్గాల వారి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

జెడ్పీలో ఐదుగురికి కారుణ్య నియామకాలు

కర్నూలు(అర్బన్): జెడ్పీ పరిధిలోని పలు మండల పరిషత్ కార్యాలయాలకు ఆఫీస్ సబార్డినేట్లుగా ఐదుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలను కల్పించి పోస్టింగ్ ఆర్డర్స్ అందించినట్లు జెడ్పీ సీఈఓ జీ.నాసరరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జీ.శ్రీనివాస సాయినితిన్ – కౌతాళం, ఎస్.మస్తాన్‌వలి – ఆళ్లగడ్డ, ఎస్.గోపినాథ్ – గూడురు, డి.పసిఫిక్ – పత్తికొండ, టీపీడీ ప్రదీప్‌కుమార్ – పాములపాడు ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చినట్లు తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో అభ్యర్థుల అర్హత, అభీష్టం మేరకు ఉద్యోగాలు కల్పించినట్లు సీఈఓ వెల్లడించారు.

డీఐజీని కలిసిన ఎస్పీ


డీఐజీ కోయ ప్రవీణ్‌కు పూలబొకే అందిస్తున్న ఎస్పీ

కర్నూలు (టౌన్): జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విక్రాంత్ పాటిల్ సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక బి.క్యాంపులోని కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన్ను కలిసి పూలబొకే అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


రగ్బీ క్రీడాకారిణి దివ్యకుమారిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న కే.దివ్యకుమారి జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చైతన్య స్రవంతి తెలిపారు. జనవరి 24 నుంచి 27వ తేదీ వరకు పల్నాడులోని ఫిరంగిపురంలో జరిగిన 10వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో సత్తా చాటి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి దివ్యకుమారి, పీఈటీ సుప్రియను సోమవారం ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆమె అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

అమాయకులపై హత్యాయత్నం కేసులా?

- దాడులకు పాల్పడిన వారందరిపై కేసులు నమోదు చేయాలి


ఆవేదన వ్యక్తం చేస్తున్న బ్రాహ్మణదొడ్డి మహిళలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఈ నెల 1వ తేదీన జరిగిన ఘటనకు సంబంధించి అమాయకులైన సర్పంచు బోయ దస్తగిరితో పాటు మరో ఎనిమిది మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని గ్రామానికి చెందిన మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్‌తో కలిసి వెళ్లి జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు గోడు వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్‌పీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. వివాహ వేడుకలో తమ కుటుంబ సభ్యులపై గ్రామానికి చెందిన వడ్డె రాముడుతో పాటు మరో 15 మంది వేట కొడవళ్లు, రాడ్లతో దాడి చేశారన్నారు. తమ వారైన బోయ తిమ్మన్న, మేకల రాముడును హత్య చేయాలనే లక్ష్యంతో విచక్షణా రహితంగా నరికారని వాపోయారు. ప్రస్తుతం వీరిద్దరు చావుబతుకుల మధ్య కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. తీవ్రంగా గాయపడి గుర్తై చికిత్స పొందుతున్న తమ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి తెగబడిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, ఘటనలో ప్రమేయం ఉన్న మరో ఏడుగురిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వివాహిత దారుణహత్య

- భర్త హత్య చేసినట్లు అనుమానం
- విచారణ చేస్తున్న పోలీసులు


హత్యకు గురైన షేక్ మాబున్నీ

తుగ్గలి: పొలంలో పనిచేసుకుంటున్న మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ సంఘటన తుగ్గలి మండలం రాతన కొత్తూరులో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కాశింబీ కూతురు షేక్ మాబున్నీ (32)ను 15 ఏళ్ల క్రితం చెన్నంపల్లికి చెందిన అక్బర్‌వలికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి కుమారులు ఆసిఫ్ (12), లాలూసాహెబ్ (9) ఉన్నారు. ఈ క్రమంలో మాబున్నీ తొమ్మిదేళ్ల క్రితం భర్తను వదిలి రాతన కొత్తూరుకు వచ్చి పుట్టింట్లోనే ఉంటోంది. అప్పుడప్పుడు వచ్చి వెళుతుండే భర్త ఎక్కడంటే అక్కడ తిరుగుతుండేవారు. ఈ క్రమంలో మాబున్నీ సోమవారం వేరుశనగ పంటకు నీటి తడులు పెట్టేందుకు వెళ్లింది. ఆ సమయంలో దుండగుడు కత్తితో విచక్షణా రహితంగా దాడిచేసి చంపి పరారయ్యాడు. కాసేపటికి పొలానికి వెళ్లిన ఆమె సోదరుడు రక్తపు మడుగులో పడిఉన్న మృతదేహాన్ని గుర్తించాడు. పరుగున ఇంటికొచ్చి ఎద్దుల బండి తీసుకెళ్లి మృతదేహాన్ని ఇంటికి చేర్చాడు. విషయం తెలుసుకున్న పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, తుగ్గలి ఎస్‌ఐ కృష్ణమూర్తి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. భర్తనే కత్తితో దాడిచేసి భార్యను అంతమొందించి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. హతుడి మానసిక స్థితి సరిగా లేదని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు అక్బర్‌వలి కోసం గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు ఉపాధి అవకాశాలను మరింత మెరుగుపరచడంలో భాగంగా కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సరికొత్త శిక్షణకు శ్రీకారం చుట్టింది. మొదటిసారిగా లైట్ మోటారు వెహికల్(ఎల్‌ఎంవీ) డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లుగా ఆ సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ తెలిపారు. ఈ నెల 24 నుంచి నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 – 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలని, శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆరు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా, విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు 4 వీలర్ ఎల్‌ఎల్‌ఆర్ జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కర్నూలు శివారులోని బి.తాండ్రపాడు సమీపంలోని కెనరా బ్యాంకు– గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో సంప్రదించవచ్చని, 63044 91236, 85006 77585 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

మహిళా ఉద్యోగికి వేధింపులు


ఆవేదన వ్యక్తం చేస్తున్న జయలక్ష్మి

నంద్యాల(న్యూటౌన్): మహిళా ఉద్యోగి అని చూడకుండా సెలవు విషయంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి వేధింపులకు గురి చేస్తున్నారని బాధితురాలు జయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తాను 2వ వార్డు మాల్దారిపేట సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పని చేస్తున్నానని, 7 నెలల వయసున్న కుమారుడి ఆరోగ్యం బాగా లేక 14 రోజులు సెలవు అడిగితే కమిషనర్ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లగా శాలరీ ప్రొసీడింగ్స్ పెట్టమని చెప్పినా తిరస్కరించారని వాపోయారు. చంటి బిడ్డతో కమిషనర్ చాంబర్ చుట్టూ తిరుగుతున్నా కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైలు చార్జీలో రాయితీ కల్పించాలి


రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): రైల్వే ప్రయాణ చార్జీల్లో వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, జర్నలిస్టులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి 50 శాతం రాయితీ కల్పించాలని పట్టణ పౌరసంక్షేమ సంఘం (పీపీఎస్‌ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనాకు ముందు ఆయా వర్గాల వారికి రైలు చార్జీలో 50 శాతం రాయితీ ఉండేదని, అప్పట్లో ఎన్డీఏ ప్రభుత్వం రద్దుచేసి తర్వాత పునరుద్ధరించలేదన్నారు. బహుళ జాతి కంపెనీలకు రూ.15 లక్షల కోట్ల రాయితీలు కల్పించిన ప్రధాని నరేంద్రమోదీ సమాజ సేవ చేసే ఆయా వర్గాలకు ఎందుకు రాయితీ ఇవ్వరని ప్రశ్నించారు. ఎస్.సర్ఫ్రాద్దీన్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేత కొత్తకోట వృషభాలు


వృషభాల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

వెల్దుర్తి: బొమ్మిరెడ్డిపల్లెలో పామయ్యతాత తిరునాల పురస్కరించుకుని నిర్వహించిన న్యూ కేటగిరీ వృషభాల బండలాగుడు పోటీల్లో డోన్ మండలం కొత్తకోటకు చెందిన డాక్టర్ గురునాథ్ వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూళాన్ని 4,218 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. మాజీ ఎంపీపీ శైలజా సుబ్బరాయుడు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఐజీ కోయ ప్రవీణ్ ప్రారంభించారు. పామయ్య తాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొనగా తరువాతి స్థానాల్లో వైఎస్సార్ జిల్లా బాలయ్యగారిపల్లె విష్ణువర్ధన్ రెడ్డి వృషభాలు, నంద్యాల జిల్లా లక్ష్మంపల్లె గూడూరు శివారెడ్డి, సీసంగుంతల రాజు వృషభాలు సంయుక్తంగా, అనంతపురం జిల్లా రుద్రవరం ఎల్లగౌడ్, సింగనగుంట పల్లె మోహన్ కృష్ణ వృషభాలు సంయుక్తంగా, నంద్యాల జిల్లా మల్లెల ఎస్‌ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు, నంద్యాల జిల్లా కొత్తకొట కంబయ్య వృషభాలు నిలిచి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. విజేతలకు టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు, దాతలు బహుమతులందించారు. పోటీల్లో పాల్గొన్న వృషభాల యజమానులందరికీ ప్రోత్సాహక బహుమతులందించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు. సీఐ మధుసూదన్ రావ్, ఎస్‌ఐ అశోక్ బందోబస్తు నిర్వహించారు.